కథ

''ఒక వ్యక్తి పెద్ద బండరాయిని కష్టపడి ఊరిమధ్యకు తీసుకువచ్చాడు. ఊరి వారందరూ దాన్నిచూసి 'ఏముందా బండరాయిలో' అనడిగారు. ఆ వ్యక్తి వారి కేసి మందహాసంతో చూసి ఇలా అన్నాడు- ఆ బండరాయిలో అందమైన శిల్ప ముంది...జాగ్రత్తగా చెక్కగలిగితే!''

# శిల్పం

★★★

ఆ ప్రదేశమంతా బండరాళ్లను పగలగొడుతున్న శబ్దాలు ఖణేల్ ఖణేల్ మంటూ వినిపిస్తున్నాయి. చేతిలోని బరువైన సుత్తి బండరాయిని తాకినప్పుడల్లా ఆ పిల్లవాని కళ్లలో ఒక రకమైన పైశాచిక తృప్తి కనిపిస్తోంది. పన్నెండేళ్ల వయసుకే అతని చేతులు కఠినంగా తయారయ్యాయి. అతని మనసు మరింత కఠినంగా...అతను పగలగొడుతున్న బండరాళ్లకంటే కూడా కఠినంగా తయారైంది. అతనా బండరాయిలో ప్రపంచాన్నీ, తనను హింసించిన మనుషులనూ ఊహించుకుని మరింత కసిగా కొడుతున్నాడు. సుత్తిదెబ్బకి ఆ బండరాయి బీటలు తీసినప్పుడల్లా అతని ఉత్సాహం రెట్టింపవుతోంది.

ఇంతలో వార్డెన్ నుంచి పిలుపు వినబడింది. ఆ పిలుపు కోసమే ఎదురుచూస్తున్నట్టు అక్కడ పని చేస్తోన్న పిల్లలందరూ పని ఆపేసి భవనం లోపలకు పరుగెత్తారు. అయితే అతను మాత్రం కదల్లేదు. ''రేయ్ చందూ, నిన్ను మళ్లీ విడిగా పిలవాలా?'' వార్డెన్ అరుపు మరోసారి కర్కశంగా వినబడింది. ఇంక తప్పదన్నట్టు అతను చేతిలోని సుత్తిని ప్రక్కన పడేసి లోపలకు నడిచాడు.

లోపల క్రిస్టియన్ ఫాదర్ పిల్లలందరికీ బత్తాయిపళ్లు పంచిపెడుతున్నాడు. ప్రతి ఆదివారమూ ఆయన అలాగే జైలులో ఉన్న పిల్లలందరికీ బత్తాయిపళ్లు పంచిపెడుతుంటాడు.

చందు వంతు వచ్చింది. ఆయన చందుకేసి చూసి, ''ఎవరీ కొత్త పిల్లాడు'' అని వార్డెన్‌ని అడిగాడు.

''ఇతను ఈ పిల్లల జైలుకొచ్చి నాలుగు రోజులయింది సార్'' అన్నాడు వార్డెన్.

''ఏం'' అన్నాడు ఫాదర్, చందు బత్తాయిపండు తీసుకుని వెళ్లిపోయాక.

''ఇతను ఇదివరకు కూడా అప్పుడప్పుడూ జైలులో పడుతుండేవాడు సార్. ఇంత చిన్న వయసులోనే చాలా సైకిళ్ళు దొంగతనం చేశాడు. చాలామంది జేబుల్ని కొట్టేశాడు''

''ఏం చేస్తాడవన్నీ?''

''సైకిళ్లను ఏ కీలుకాకీలు విరగగొట్టి కాలవలో పడేస్తాడు. పర్సులోని నోట్లన్నీ ముక్కలుగా చింపి అవతల పడేస్తాడు''

ఆ మాట వినగానే ఫాదర్ ఆశ్చర్యంగా చూశాడు. ఒక నిమిషమాలోచించి, ''నాకు అతని వివరాలు కావాలి'' అన్నాడు వార్డెన్‌తో.

★★★

చందు పుట్టిన కొన్ని రోజులకే అతని తల్లి చనిపోయింది. అతని తండ్రి చందుని మరింత ప్రేమగా పెంచడానికి బదులు హింసించడం ప్రారంభించాడు. చుట్టుప్రక్కల వాళ్లు కూడా అతనిని నష్టజాతకుడంటూ దూరంగా ఉంచేవారు.

కొంతకాలమాగి, అతని తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆవిడ చందుని-తన భర్తకు మొదటి భార్య జ్ఞాపకంగా భావించి హింసిస్తుండేది. ఇలా అందరు వ్యక్తులూ

> ''ఇంతచిన్న వయసులో ప్రపంచంపట్ల ఇంత కసి పెంచుకున్న కుర్రాడు- ఇలాగే పెరిగి పెద్దయితే ఎలాంటి వ్యక్తిగా తయారవుతాడు? నాజీలను ఊచకోత కోసిన హిట్లర్‌గానా? ఏమో! లేదు...అలా కావడానికి వీలులేదు'...

ఆ పిల్లవాణ్ణి మానసికంగానూ, శారీరకంగానూ బాధిస్తూ ఉండడంతో అతనిలో ఈ ప్రపంచంపట్ల ఒక రకమైన కసి మొదలయింది.

ఒకరోజు తండ్రి, అతని కొత్త భార్య, ఇద్దరూ ఇంట్లో నిద్రపోతోంటే, చందు ఆ ఇంటికి నిప్పు పెట్టి పారిపోయాడు. తర్వాత చిన్నచిన్న దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. అతని లక్ష్యం ఒక్కటే- ఏది దొరికితే దాన్ని నాశనం చెయ్యడం. కరెన్సీ నోట్లను చింపేసేవాడు. పబ్లిక్ లైబ్రరీల్లో పుస్తకాలను ముక్కలుగా చేసేవాడు. సైకిళ్లను విరగకొట్టేవాడు. ఆడపిల్లల జడలు లాగి ఏడిపించేవాడు. అపుడపుడూ పోలీసులు అతన్ని పట్టుకుని బాలనేరస్తుల జైలులో కొన్నాళ్లు ఉంచుతుండేవారు. విడుదలయ్యాక మళ్లీ మామూలే.

వార్డెన్ నుంచి ఈ వివరాలు విన్న ఫాదర్ ముఖం ఆవేదనతో నిండిపోయింది.

''ఇంత చిన్న వయసులో ప్రపంచంపట్ల ఇంత కసి పెంచుకున్న కుర్రాడు-ఇలాగే పెరిగి పెద్దయితే ఎలాంటి వ్యక్తిగా తయారవుతాడు? నాజీలను ఊచకోత కోసిన హిట్లర్‌గానా? ఏమో! లేదు...అలా కావడానికి వీలులేదు'...

''ఈ పిల్లవానికి శిక్ష ఇంకా ఎన్నిరోజులుంది'' అడిగాడు.

''ఇంకా రెండేళ్ళపైనే ఉంది సార్'' అన్నాడు వార్డెన్.

''వారానికోరోజు అతన్ని మా ఇంటికి తీసుకువెళ్ళడానికి పర్మిషనిస్తారా''

ఆయన మాటలు వినగానే వార్డెన్ విభ్రాంతితో చూశాడు. ఒక నిమిషం ఊపిరి కూడా పీల్చడం మరచిపోయినట్టు ఉండిపోయాడు. ఆ తర్వాత, ''వీడినా..'' అన్నాడు.

''అవును వార్డెన్‌గారూ. ఈ బాబునే''

''మామూలుగా అయితే కుదరదు సార్. కాని మీరు అడుగుతున్నారు కాబట్టి..తీసుకెళ్ళండి. కానీ జాగ్రత్త. ఈ కుర్రాడు మీ ఇంటికి కూడా నిప్పు పెట్టగలడు''

ఫాదర్ చిన్నగా నవ్వి, ''పరవాలేదండి. థాంక్స్. వారానికి ఓరోజు తీసుకువెళ్ళి మళ్ళీ జాగ్రత్తగా తీసుకువచ్చి అప్పజెబుతాను'' అన్నాడు.

''మీరింతగా చెప్పనవసరంలేదు ఫాదర్. తీసుకువెళ్ళండి. మీ ఆశీస్సులతోనయినా ఈ కుర్రాడు బాగుపడతాడేమో, లేకుంటే ఈ జైలులోనే జీవితమంతా గడిపేలా ఉన్నాడు'' వార్డెన్ అనుకోకుండా ఆ మాటలు అన్నా, చివరికి ఆ మాటలే నిజమయ్యాయి-మరోరకంగా!

★★★

ఇంటిబయట క్రోటన్స్, వరండాలో ఉయ్యాలబల్ల, గోడలకమర్చిన ఏసుక్రీస్తు బొమ్మలు...వాటికేసి విప్పారిత నేత్రాలతో చూస్తున్నాడు.

''ఎలా ఉంది ఇల్లు'' ఫాదర్ అడిగాడు.

చందు ఫాదర్‌కేసి చూశాడు. అతని కళ్ళలో నిర్లక్ష్యం, జడత్వం-వాటి వెనుక దాగిన పసితనం..

''బాగుంది'' అని ఊరుకున్నాడు.

లోపల్నుంచి ఫాదర్ భార్య బయటకు వచ్చింది.

''ఇతనేనా మీరు చెప్పిన అబ్బాయి'' అందావిడ.

''అవును. చందు ఇతని పేరు''

చందు ఆమెకేసి తిరిగాడు. అమృతం నిండిన కళ్ళతో చూస్తోందావిడ.

అంతవరకూ-తన సవతి తల్లిలోనూ, చుట్టుప్రక్కల ఇళ్ళలోని ఆడవాళ్ళలోనూ పైశాచికత్వాన్ని చూసిన అతను-ఆవిడ కళ్ళలో కనబడే లాలిత్యాన్ని అబ్బురంగా



చూశాడు.

''బాబూ..ఇలారామ్మా'' అందావిడ చేతులు సాచి.

చందు నెమ్మదిగా ఆమెకేసి నడిచాడు. అయినా లోపల అతనికి అనుమానంగానే ఉంది. 'తన సవతి తల్లిలాగే దగ్గరకు వచ్చాక కొడుతుందా..ఊహు''-ఆమె అతనిని దగ్గరగా తీసుకొని ఆప్యాయంగా తల నిమిరింది.

అతనికి తన తల్లి ఎలా ఉంటుందో తెలీదు. కాని అతనికా క్షణంలో అన్పించిందొకటే-

తల్లి అంటే అలానే ఉంటుందని. అతని కళ్ళు సజలభాష్పాలయ్యాయి. కోల్పోయిన పెన్నిధి ఏదో దొరికినట్లు ఆమెను మరింత గట్టిగా పట్టుకొని ''అమ్మా...అమ్మా'' అన్నాడు రుద్ధమైన గొంతుతో.

అక్కడే నిలబడి గమనిస్తోన్న ఫాదర్ తృప్తిగా చూశాడు. ఆ పిల్లవాడిని మంచిగా మార్చగలనన్న నమ్మకంతో వచ్చిన తృప్తి అది.

ఫాదర్ ఇంటిలో అతనికి పూర్తి స్వేఛ్ఛనిచ్చారు. వారితోపాటే భోజనం-అతనికి ప్రత్యేకంగా ఒక గదినిండా ఆటబొమ్మలు, బొమ్మల పుస్తకాలు--

అవన్నీ చూడగానే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

డాక్టర్ దర్భా సత్యనారాయణ మూర్తి

''ఎందుకివన్నీ నాకు. నేను దొంగని కదా'' అన్నాడు ఏడుస్తూ.

''లేదు బాబూ. నువ్వు దొంగవు కావు. నువ్వు కొన్ని పొరపాట్లు చేసి ఉండవచ్చు. కాని తప్పులు చేయడం అందరికీ సహజం. అయితే తమ తప్పులు తెలుసుకోవడం గొప్పతనం. ఇకముందు అలాంటి తప్పులు చేయకుండా మంచిగా మారడానికి ప్రయత్నించు. భగవంతుడు అలాంటివాళ్ళకు తప్పకుండా సాయపడతాడు'' అని చెప్పాడు ఫాదర్ అనునయంగా.

''భగవంతుడెవరు?''

ఫాదర్ సాలోచనగా గోడవైపు ఉన్న ఏసుక్రీస్తు

పెయింటింగ్‌కేసి చూశాడు.

''మరి నా చిన్నప్పుడు మా ఇంట్లో వెంకటేశ్వర స్వామి బొమ్మ ఉండేది'' అన్నాడు చందు.

ఫాదర్ చిన్నగా నవ్వి, ''బాబూ. నీకు ఐస్‌క్రీమ్ ఇష్టమా? పాలకోవా ఇష్టమా?'' అన్నాడు.

''ఐస్ క్రీమ్ చాలా ఇష్టం''

''అలాగే కొందరికి పాలకోవా కూడా ఇష్టం ఉండొచ్చుకదా''

''అవును''

''చూడు మరి. కొందరికి పాలకోవా ఇష్టం. మరికొందరికి ఐస్‌క్రీమ్ ఇష్టం. కానీ రెండింటిలో ఉండేది పాలే. రూపాలు వేరంతే. దేవుడు కూడా అంతే. మనందరినీ ప్రేమించి, క్షమించగలిగే గొప్పవ్యక్తి దేవుడు. ఆ దేవుడు కొందరికి వెంకటేశ్వరస్వామి రూపంలో, మరికొందరికి ఏసుక్రీస్తు రూపంలో, మరికొందరికి అల్లారూపంలో..ఏ రూపంలో ఉన్నా దేవుడొకడే. ఈ విషయాన్ని గ్రహించగలిగినవాడు మతాలకోసం పోరాడడు. మానవత్వం కోసం పాటుపడతాడు. ఎదుటి వ్యక్తికి సహాయపడడం ద్వారా దేవునిగా ఎదగగలుగుతాడు'' ఫాదర్ ఉద్విగ్నంగా చెప్పాడు.

చందుకి ఆయన మాటలు పూర్తిగా అర్థం కాలేదు. కాని అవి బలంగా మనసులో ముద్రించుకొన్నాడు.

''ఫాదర్ నాకు చదువుకోవాలని ఉంది. నేర్పిస్తారా'' అనడిగాడు.

అతనిలో ఏదో తపన కనబడుతోంది.

ఇనుముని ఎర్రగా కాల్చి బలమైన సుత్తి దెబ్బలతో పదును పెట్టవచ్చు. కానీ మనసును చైతన్యవంతం చేయాలంటే ప్రేమకే సాధ్యం. ఫాదర్, ఆయన భార్య చూపిస్తోన్న ప్రేమతో-చందులోని ద్వేషం, నేరప్రవృత్తి నెమ్మదిగా ప్రపంచం పట్ల, జీవితం పట్ల ప్రేమగా పరివర్తన చెందుతున్నాయి. అతను నెమ్మదిగా రాయడం, చదవడం నేర్చుకున్నాడు. జైలులో ఉన్న సమయంలో కూడా దీక్షగా సాధన చేసేవాడు. అతని పట్టుదలకు ఫాదర్ ప్రోత్సాహం తోడవడంతో సంవత్సరం తిరిగేసరి కల్లా నేరుగా అయిదవ తరగతి పరీక్షలు రాయలిగాడు.

ఒకరోజు ఫాదర్ చెప్పిన విషయం అతనికి అశనిపాతంలా తాకింది.

అది-ఫాదర్ అమెరికా ప్రయాణం.

చాలా రోజుల తరువాత దొరికిన తోడు, ప్రేమ దూరంగా జరిగిపోతున్నాయన్న భావం అతనిని పట్టి వేధించసాగింది.

అతన్ని అర్థం చేసుకున్నట్టు ఫాదర్ ఇలా అన్నాడు.

''బాబూ. మేం దూరంగా వెళ్తున్నామని బాధపడకు. మేం కొంతకాలం అక్కడ ఉండి తిరిగివస్తాం. అప్పటికి నువ్వుమరింత పరిణతి చెందాలి. ప్రేమను స్వీకరించే స్థాయి నుండి ప్రేమను అందించగలిగే స్థాయికి ఎదగాలి. తీసుకోవడంలో ఆనందం ఉండవచ్చు. కాని ఇవ్వడంలో మరింత ఆనందం..తృప్తితో కూడిన ఆనందం ఉంది. నువ్వు అలాంటి ఆనందం పొందాలి. ఆ స్థాయికి ఎదగగలవన్న నమ్మకం నాకుంది. నీకు భగవంతుని ఆశీస్సులు తప్పకుండా ఉంటాయి.''

చందు మరేమీ మాట్లాడలేనట్లు ఫాదర్ పాదాలమీద వాలిపోయాడు.

★★★

ఇరవై సంవత్సరాల తర్వాత ఫాదర్ ఇండియాకు వచ్చాడు. అప్పటికాయన బాగా వృద్ధుడయ్యాడు. కొద్దిపాటి ప్రయత్నంతో చందు ఎక్కడున్నాడో తెలుసుకోగలిగాడు.

జై..లు..లో!

వెంటనే అతన్ని కలుసుకోవాలనుకున్నాడు. ఈసారి అతనిని కలుసుకోవడం కొంచెం కష్టమయింది. జైలులో బాగా లోపల అతని గది విడిగా ఉంది.

'డాక్టర్ చంద్రశేఖర్'..గది బయట నేమ్‌ప్లేట్ మెరుస్తూ కనబడింది.

ఫాదర్ ఆ గదిలోకి ప్రవేశించాడు.

ఫాదర్‌ని చూడగానే చందు ఉద్వేగంగా లేచి నిలబడ్డాడు.

''బాబూ..నా కలను నిజం చేశావు. నాకు చాలా గర్వంగా ఉంది. ఎలా సాధించగలిగావు ఇదంతా'' అన్నాడు సంతోషంగా.

''మీ ఆశీస్సులే ఫాదర్. మీరందించిన ప్రోత్సాహంతో, నైతికబలంతో-జైలు నుంచి బయటకు విడుదల కాగానే కాలేజీ చదువు, మెడిసిన్ చదువు పూర్తయింది. ఆ రోజుల్లో నేను చిన్నప్పుడు పెరిగిన జైలు వాతావరణం నాకు తరచు గుర్తుకు వచ్చేది. ఆ జైలులో ఎవరికీ అక్షరాలు రాయడం కూడా రాదు. ఆరోగ్యం గురించి శ్రద్ధ ఉండేది కాదు. ఒకరినొకరు ఓదార్చుకుంటూ, లోకం పట్ల కసితో జీవించేవాళ్ళం. చిన్న పిల్లలని కూడా చూడకుండా రాళ్ళు కొట్టడం లాంటి బరువైన పనులు అప్పగించేవారు. అలాంటి పరిస్థితులను కొద్దిగానైనా మార్చగలిగితే, ఆ పిల్లలు జైలు బయటకు వచ్చాక మళ్ళీ నేరస్తులుగా మారకుండా చూడవచ్చని నాకనిపించింది. మెడిసిన్ పూర్తికాగానే నా కోరికను ప్రభుత్వానికి తెలియజేశాను. నాకు ఇక్కడే మెడికల్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ పిల్లలని చూస్తే జాలేసేది. తెలిసీ తెలియని వయసులో సినిమాలు చూసి పాడయిన వాళ్ళే చాలామంది. స్కూలులో తోటి పిల్లల్ని తుపాకీతో కాల్చిచంపడం, ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం..ఇలాంటివన్నీ ఈ పిల్లలు చేయడానికి కారణం-వారి చుట్టూ ఉన్న పరిస్థితులే. కాబట్టి ఇక్కడ వారిని మంచిగా ప్రభావితం చేయడానికి, మంచివారుగా మార్చడానికి మేం వీలయినన్ని అవకాశాలు కల్పిస్తున్నాం. ఆ పిల్లలు జైలులో ఉన్నామన్న భావన లేకుండా ఇక్కడ చదువుకోవచ్చు. తమకిష్టమైన హాబీలను కొనసాగించవచ్చు. రోజూ ఓ గంట సేపు వ్యాయామం అలాగే ఉదయం, సాయంత్రం మొక్కలకు నీళ్ళు పొయ్యవలసి ఉంటుంది. ఇక్కడ వారిని ప్రేమగా చూసుకునే ఆయాలు కూడా వున్నారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలతో వారు తప్పకుండా మంచి పౌరులుగా మారతారు. ప్రేమ నేరస్తుణ్ణి కూడా మంచివాడిగా మార్చగలదు. నేనే దానికి ఉదాహరణ'' అన్నాడు చందు ఉద్విగ్నంగా.

ఫాదర్ అతనికేసి తృప్తిగా చూశాడు.

ప్రతీ బండరాయిలోనూ ఒక అందమైన శిల్పముంది---

జాగ్రత్తగా చెక్కగలిగితే!

☆




